సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

చకచకా యూపీహెచ్‌సీ నిర్మాణం

- దువ్వాడలో 1.36 కోట్లతో ఆరోగ్యకేంద్రం నిర్మాణం
- త్వరలో అందుబాటులోకి రానున్న 10 పడకల ఆస్పత్రి



నిర్మాణ దశలో ఉన్న దువ్వాడ 10 పడకల యూపీహెచ్‌సీ

కూర్మన్నపాలెం: పేదలకు అత్యాధునిక సదుపాయాలతో వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయి. ఇప్పటికే కొన్ని యూపీహెచ్‌సీల్లో వైద్య సేవలు ప్రారంభం కాగా, మరికొన్ని యూపీహెచ్‌సీల్లో నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

జీవీఎంసీ 86వ వార్డు దువ్వాడలో రూ.1.36 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 10 పడకల యూపీహెచ్‌సీ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రస్తుతం స్థానిక కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్న ఆస్పత్రిలో సరైన సదుపాయాలు లేకపోవడంతో పూర్తిస్థాయి వసతులతో కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ యూపీహెచ్‌సీలో జనరల్ ల్యాబ్‌తో పాటు రక్తపరీక్షల ల్యాబ్, మెడికల్ డిస్పెన్సరీ, మందులు ఇచ్చే గది, కోల్డ్‌స్టోరేజీ గది, డాక్టర్ గదులు, రోగులు వేచి ఉండే హాలు నిర్మిస్తున్నారు. వైద్యకేంద్రంలో నిత్యం ఏడుగురు వైద్య సిబ్బంది ప్రజలకు సేవలందిస్తారు. వారిలో ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నిషియన్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక అటెండర్ ఉంటారు. రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యసేవలను అందిస్తారు. ప్రతీ రోజు ఒక స్పెషలిస్ట్ డాక్టర్ యూపీహెచ్‌సీని సందర్శించి వైద్య సేవలను అందించనున్నారు. జనరల్ మెడిసిన్‌తో పాటు జనరల్ సర్జన్, చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు, ఆర్థో, గైనిక్ సేవలను అందించేందుకు ప్రత్యేక వైద్యులను నియమిస్తున్నారు. ఈ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా వెదుళ్లనరవ, మంగళపాలెం, దువ్వాడ-1,2, భరత్‌నగర్-1,2, డాక్‌యార్డ్‌కాలనీ వంటి మొత్తం 7 సచివాలయాల పరిధిలో ఉండే ప్రజలకు దువ్వాడలో నిర్మితమవుతున్న యూపీహెచ్‌సీ ద్వారా వైద్య సేవలు అందనున్నాయి. ప్రస్తుతం రోజుకు 30మందికి వైద్యసేవలు అందుతున్నాయి. దువ్వాడ యూపీహెచ్‌సీ ప్రారంభమైతే రోజుకు సుమారు మరో 70 మందికి వైద్యసేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు ప్రారంభించనున్నారు.

రోగులకు మరింత మెరుగైన సేవలు



దువ్వాడలో నూతనంగా నిర్మిస్తున్న యూపీహెచ్‌సీలో అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేస్తుండడంతో రోగులకు మరింత మెరుగైన సేవలను అందించడానికి వీలుగా ఉంటుంది. మరో 20 రోజుల్లో దువ్వాడ యూపీహెచ్‌సీ ప్రారంభం కానుంది. ల్యాబ్ టెస్టులు అన్నీ అందుబాటులో వస్తాయి.

–దున్నా నళిని పుష్పలత, యూపీహెచ్‌సీ వైద్యాధికారి

ఉక్కు ఉద్యమంలో మరో మైలురాయి

900వ రోజుకు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: ఉక్కు కర్మాగార పరిరక్షణ కోసం, కార్మికుల భవిష్యత్తు కోసం 900 రోజులుగా చేస్తున్న దీక్షలు మరో మైలురాయిని చేరుకున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. దేశ చరిత్రలోనూ ఈ ఉద్యమం నిలిచిపోతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 900వ రోజు సోమవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఇస్తే కార్మికుల భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు వైఖరిపై కార్మికుల ఆగ్రహం

'చలో గంగవరం' కార్యక్రమానికి తరలిన అఖిలపక్షాలు



చలో గంగవరం పోర్టు ముందుండి నడిపిస్తున్న అఖిలపక్ష కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌పై గంగవరం పోర్టు అవలంబిస్తున్న వైఖరిపై ఉక్కు కార్మిక వర్గం పెద్ద ఎత్తున నిరసించింది. గంగవరం పోర్టు వైఖరిని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున చలో గంగవరం నిర్వహించారు. గంగవరం పోర్టు ఇటీవల స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కోల్ షిప్‌లకు బెర్తులు కేటాయించకుండా ఆపివేసింది. కేవలం రూ. 50 కోట్ల కోసం ఉక్కు ఉత్పత్తికి అంతరాయం కలిగే ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. ఈ నేపథ్యంలో గంగవరం పోర్టు వైఖరిని అన్ని కార్మిక సంఘాలు ముక్త కంఠంతో ఖండించాయి. సాయంత్రం 4 గంటలకు గంగవరం పోర్టు యాజమాన్యం వైఖరికి నిరసనగా నిర్వహించిన స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు. గంగవరం పోర్టుకు వ్యతిరేకంగా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఇదే వైఖరి కొనసాగిస్తే గంగవరం పోర్టు వాహనాలను రోడ్డుపైకి రాకుండా అడ్డుకుంటామన్నారు. అప్పుడు గంగవరం పోర్టును ఎలా నడుపుతారో తాము చూస్తామని వారు హెచ్చరించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్. నర్సింగరావు, అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు తదితరులు ముందుండి నడిపించారు.

కోక్‌ఓవెన్స్‌లో పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న జీఎం సత్యనారాయణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగంలో సోమవారం ఫల (పండ్ల తోట) పార్కును ప్రారంభించారు. స్టీల్‌ప్లాంట్‌లో 38 ఏళ్ల విధులు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న కోక్‌ఓవెన్స్ విభాగం సీఆర్‌జీ సెక్షన్ జీఎం ఆర్.వి.సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇటువంటి పార్కులు పర్యావరణానికి మేలు చేస్తాయన్నారు. ఈ సందర్భంగా అధికారులు, కార్మిక నాయకులు ఆర్.వి. సత్యనారాయణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పి.కె. మిశ్రా, డీజీఎం కె. తాతారావు, దుర్గాప్రసాద్, వై.కె. దాస్, ఎం. నాగేశ్వరరావు, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు కార్మికులకు యాదవ సంఘం మద్దతు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని సీతానగరం గ్రామ యాదవ సంఘం కార్యదర్శి వంశీకృష్ణ యాదవ్ కోరారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షా శిబిరాన్ని సీతానగరం గ్రామ యాదవ సంఘం సభ్యులు సోమవారం సందర్శించారు. నిర్వాసిత కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీమసిరి శ్రీనివాస్, కణితి అప్పలరాజు, నమ్మి అప్పలనాయుడు, నమ్మి అప్పారావు, శేసెట్టి అప్పారావు, రాము సింహాద్రి, కొవిరి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తూ మూర్ఛతో వ్యక్తి మృతి



మృతుడు ఎల్లంకి శ్రీనివాస్

అక్కిరెడ్డిపాలెం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి మూర్ఛ వ్యాధికి గురై మృతి చెందిన ఘటన ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం జరిగింది. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఎల్లంకి శ్రీనివాస్ (44) లిఫ్ట్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. సోమవారం శ్రీనివాస్ గాజువాక నుంచి ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్దకు వచ్చేసరికి మూర్ఛ రావడంతో హఠాత్తుగా తన వాహనాన్ని నిలిపి పక్కకు ఒరిగిపోయాడు. బీట్ కానిస్టేబుల్ సపర్యలు చేసినా అపస్మారక స్థితిలోకి చేరుకుని మరణించాడు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం అందించి, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపారు. శ్రీనివాస్‌కు భార్య రాజ్యలక్ష్మి, ఒక పాప, బాబు ఉన్నారు. పాప పదో తరగతి, బాబు 8వ తరగతి చదువుతున్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి



మృతుడు కొలిపల్లి చిరంజీవి

కూర్మన్నపాలెం: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. గాజువాక దరి జోగవానిపాలెంలో కొలిపల్లి చిరంజీవి(26) భార్య శ్యామల, కొడుకు కార్తీక్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. ఆదివారం కాపుజగ్గరాజుపేటలో ఉన్న స్నేహితుడి ఇంటికి వెళ్లి, తిరిగి అర్ధరాత్రి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నారు. ఆ సమయంలో ఆటోనగర్ గ్రీన్‌సిటీ రహదారిపై ఉన్న మట్టి, బొగ్గు వల్ల చిరంజీవి నడుపుతున్న బైక్ అదుపు తప్పి, కాలువలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వస్తున్న వాహనదారులు గమనించి, దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న దువ్వాడ పోలీసులు చిరంజీవిని కేజీహెచ్‌కు తరలిస్తుండగా మధ్యలోనే చిరంజీవి మృతి చెందాడు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'ఉక్కు'ప్రైవేటీకరణకు నిరసనగా పాదయాత్ర

మహారాణిపేట: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా టీఎస్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర ముగింపు సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ కే.ఎస్.విశ్వనాధన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.నాగార్జునరావు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలకు స్పందన



రోగికి కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ పావని

గాజువాక: స్థానిక బెస్ట్ విజన్ కంటి ఆస్పత్రిలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఆస్పత్రి ఎండీ డాక్టర్ పావని వాడపల్లి ఆధ్వర్యంలో 80 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి, కేఎస్ఆర్

పెదగంట్యాడ: న్యూ పెంటమాంబ జిమ్ ప్రతినిధి రామోజీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలను 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, బీజేపీ గాజువాక వర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పెదగంట్యాడ జంక్షన్‌లో సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విజేతలకు మిస్టర్ విశాఖ టైటిల్‌తో పాటుగా 20 వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, శంకర్, ఎస్. రాజారావు, నాగిరెడ్డి, రామిరెడ్డి, కోటి తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మాణాల పరిశీలన



బస్ షెల్టర్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న మోడ్రన్ బస్ షెల్టర్‌ను 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు సోమవారం పరిశీలించారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆధునిక బస్ షెల్టర్లు నిర్మిస్తున్నారు. అనకాపల్లి వైపు ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం 78వ వార్డు పరిధిలో కార్పొరేటర్ గంగారావు కృషితో సుమారు 30 లక్షల జీవీఎంసీ నిధులతో కూర్మన్నపాలెం జంక్షన్‌లో బస్ షెల్టర్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగారావు బస్ షెల్టర్‌ను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత కాంట్రాక్టర్, జీవీఎంసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్ షెల్టర్ నిర్మాణం వీలైనంత వేగంగా పూర్తి చేయాలని కోరారు.

బాలాజీకి మేల్‌ఛాట్ వస్త్ర సమర్పణ



ట్రస్ట్ సభ్యులకు పట్టు వస్త్రాలు అందిస్తున్న చంద్రమౌళి దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు వైభవంగా జరుగుతున్నాయి. షీలానగర్‌కు చెందిన సీహెచ్.చంద్రమౌళి దంపతులు బాలాజీకి మేల్‌ఛాట్ వస్త్రాన్ని,ఆలయంలో జయవిజయులుకు పట్టు వస్త్రాలను సమర్పించారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు సోమవారం సాయంత్రం వాటిని అందజేశారు.

డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీ



దువ్వాడ రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు, వసతులను వాల్తేరు డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ పరిశీలించారు. సోమవారం ఆయన దువ్వాడ రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో వసతులు, సౌకర్యాలు పరిశీలించారు. ప్రయాణికుల వెయిటింగ్ హాల్, కార్యాలయాలు, టికెట్ కౌంటర్, ఫుట్ ఓవర్ వంతెన, వాడకం నీటి బొట్‌లెట్లను తనిఖీ చేశారు. వ్యాపారులు, ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు, వసతులపై ఆరా తీశారు. సిబ్బందితో ముచ్చటించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్ పీకే మహరాణా, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సీహెచ్.రఘువీర్ పాల్గొన్నారు.

'అతన్ని అలా వదిలేయకండి' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న అంపశయ్య నవీన్, నరసింహమూర్తి

అగనంపూడి: అగనంపూడికి చెందిన కంచిపాటి నరసింహమూర్తి వెంకట్ కలం పేరుతో రచించిన అతన్ని అలా వదిలేయకండి కవితా సంపుటిని కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణా భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, తెలుగు సాహితీవనం అంతర్జాతీయ సమూహం ఆధ్వర్యంలో తెలుగు సాహితీవనం వార్షికోత్సవంలో ఈ పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో పలువురు రచయితలు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేడ్చల్ కలెక్టర్ నరసింహారెడ్డి, రచయితలు ఓల్గా, సినీ గేయ రచయితలు పెద్దింటి అశోక్ కుమార్, సత్యాజీ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారికి వెండి కుందుల బహూకరణ



వెండి కుందులను తీసుకొస్తున్న మావూరి వెంకటరమణ

కొమ్మాది(భీమిలి): రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ రూ.7 లక్షలు విలువ చేసే వెండి కుందులను బహూకరించారు. మంగళవాయిద్యాల నడుమ వెండి కుందులను తీసుకొచ్చి అంతరాలయంలో శ్రీవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జగన్మోహనాచార్యులు, టీటీడీ వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

జీవో 301 పునరుద్ధరించాలి

గాజువాక: గాజువాక హౌస్ కమిటీ పరిధిలోని గృహాల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీవో 301ను పునరుద్ధరించాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి కోరారు. గాజువాకలోని ఐదు వార్డుల పరిధిలో ఈ జీవో ప్రకారం పట్టాలు పొందినవారికి ప్రభుత్వం నామమాత్రపు చార్జీలతో రిజిస్ట్రేషన్ డీడ్‌లను జారీ చేస్తుండంపై హర్షం వ్యక్తం చేశారు. 7200 పట్టాల్లో 500 మందికి నామామాత్రపు రుసుంతోనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని పేర్కొన్నారు. చాలామంది నిర్దేశిత ఫీజులు చెల్లించినా పట్టాలను పొందలేదని, వారికి కూడా కలెక్టర్ విచారణ నిర్వహించి 301 జీవో ప్రకారం పట్టాలను జారీ చేయాలని కోరారు. 2014 జనవరి ఒకటో తేదీ నాటికి ఇళ్ల ఉన్నవారికి మాత్రమే జీవో 301ని అమలు చేశారని, ఆ తరువాత కూడా చాలామంది ఇళ్ల నిర్మించుకున్నారని పేర్కొన్నారు. గతంలో ఇళ్ల ఉన్నవారు కూడా అవగాహన లేక క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోలేదన్నారు. వారికి జీవో 60 వర్తిస్తుందని ప్రభుత్వం పేర్కొందని, ఈ జీవో ప్రకారం ఫీజులు అధికంగా ఉన్నాయన్నారు. దీనికోసం జీవో 301ని పునరుద్ధరించి, వారికి కూడా పట్టాలు జారీ చేయాలని ఓ ప్రకటనలో కోరారు.



వైఎంసీఏ సౌత్ ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా రొనాల్డ్



రొనాల్డ్ విలియమ్స్

బీచ్ రోడ్డు: వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్‌లో విశాఖ వైఎంసీఏకు చెందిన నలుగురికి చోటు లభించింది. వైఎంసీఏ సౌత్‌ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా మరోసారి రొనాల్డ్ విలియమ్స్ ఎంపికయ్యారు. సోమవారం జరిగిన వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో రొనాల్డ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేషనల్ కౌన్సిల్ వైస్ చైర్‌పర్సన్‌గా బెట్సీ విలియమ్స్,ఈసీ సభ్యులుగా కృపానందకుమార్, విజయ్‌ప్రదాన్ ఎన్నికయ్యారు.

17 నుంచి శ్రావణ మాసం పూజలు



సిరులతల్లి కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు శ్రావణ మాసం పూజలు జరగనున్నాయి. కనమహాలక్ష్మి దేవస్థానంలో నెల రోజులూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్ర వారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు(దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చుతుంది. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రాలు, మహాప్రసాదం అందజేస్తారు. పూజా రుసుంను అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచిలో చెల్లించాలని ఆలయ ఈవో శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. పూర్తి వివరాలకు 0891-2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించాలన్నారు. పూజలో పాల్గొనలేని భక్తుల గోత్రనామాలతో పూజ చేసి లక్ష్మీ యంత్రం, కుంకుమ, ప్రసాదం పోస్టల్ ద్వారా ఇంటికి పంపనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

హిందీ హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ (చెన్నై) సెప్టెంబరులో నిర్వహించే హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 5 వరకు గడువు పెంచారు. ఆంధ్ర, తెలంగాణలో వర్షాల కారణంగా రూ.10 అపరాధ రుసుముతో ఈ గడువు పెంచినట్టు నిర్వాహకులు ప్రకటించారు. మిగిలిన వివరాలకు 89858 97419లో సంప్రదించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ కృష్ణారావు కోరారు.

బోటు షికారు నిలిపివేత

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో బోటు షికారును ప్రస్తుతం నిలిపివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సముద్రంలో అలల ఉధృతి తీవ్ర స్థాయిలో ఉండటం , బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం దృష్ట్యా బోటు షికారు నిలిపివేస్తున్నామని, వాతావరణం అనుకూలించిన తరువాత కొనసాగిస్తామని పేర్కొన్నారు.

సత్యదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు నేడు

దాబాగార్డెన్స్: అధిక శ్రావణ శుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ మహలక్ష్మీ నగేష్ తెలిపారు. భక్తులు సామూహిక వ్రతంలో పాల్గొనాలని, సత్యదేవుడిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు. విశేష పౌర్ణమి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. భక్తులు ప్రదక్షిణ చేసేందుకు, విశేష వ్రతాచరణకు ఆలయ ప్రధాన అర్చకుడు పి.నరసింహాచార్యులు నేతృత్వంలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.





